క్లుప్తంగా

హోమియో వైద్యాధికారిగా చంద్రశేఖరరావు


డాక్టర్ చంద్రశేఖరరావు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి పీహెచ్‌సీలోని హోమియో వైద్యశాలకు వైద్యాధికారిగా వి.చంద్రశేఖరరావును ప్రభుత్వం నియమించింది. ఈసందర్భంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హోమియో వైద్యంలో బీపీ, షుగర్, థైరాయిడ్, లివర్,కిడ్నీలో రాళ్లు, అలర్జీలు, అసిడిటీ, మెడనొప్పి, నడుంనొప్పి, చర్మ,నరాల సంబంధిత, ఇతర వ్యాధులకు మంచి మందులున్నాయన్నారు. హోమియో వైద్యసేవలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ముగ్గుల పోటీలు


ముగ్గులు వేస్తున్న మహిళలు

గుర్ల: మండల కేంద్రంలోని రామాలయం వద్ద గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగుల ఆధ్వర్యంలో సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారులకు మ్యూజికల్ చైర్, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయుడు రాలి శ్రీనివాసరావు మాట్లాడుతూ సంక్రాంతి పండగ విశిష్టతను నేటి తరానికి తెలియజేసేందుకు సంబరాలు నిర్వహించామని చెప్పారు.

కృష్ణారాయుడు తీర్థం రేపు


కృష్ణారాయుడుస్వామి ఆలయం

వేపాడ: మండలంలోని కృష్ణారాయుడుపేట గ్రామంలో బుధవారం కృష్ణారాయుడుస్వామి తీర్థం నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ అర్చకుడు ఫణీంద్రశర్మ మంత్రోచ్ఛారణాల నడుమ ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అదేరోజు సాయంత్రం ఎడ్ల పందాలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పేదలకు దుస్తుల పంపిణీ


పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న విజయరాంపురం యువత

దత్తిరాజేరు: సంక్రాంతి పండగను పురస్కరించుకుని దత్తిరాజేరు మండలంలోని విజయరాంపురం గ్రామానికి చెందిన వాడపల్లి నూకిశెట్టి, గొర్లి నారాయణ, మరడ కామేశ్వరరావు పేదలకు సోమవారం చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కొన్నేళ్లుగా గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. పుట్టి పెరిగిన ఊరికి, ప్రజలకు మంచిచేయడమే లక్ష్యమన్నారు.

లక్కీ డ్రా విజేతలకు బహుమతులు


లక్కీ డ్రా తీస్తున్న ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ డి.సూర్యప్రకాశరావు

గజపతినగరం: మండల కేంద్రంలోని వీఎస్‌ఆర్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు వినియోగదారులకు సోమవారం లక్కీ డ్రా నిర్వహించి, విజేతలను ఎంపిక చేశారు. స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ డి. సూర్యప్రకాశరావు అతిథిగా హాజరై లక్కీ డ్రా తీసి విజేతలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హెచ్‌పీ గ్యాస్ గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్‌లో భాగంగా గతేడాది అక్టోబర్ నుంచి లక్కీ డ్రా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.లాటరీలో మొదటి మూడు బహుమతులకు విజేతలుగా పి.కృష్ణవేణి, జి.సావిత్రి, జి.రామకృష్ణ ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఏజెన్సీ డీలర్లు వి.సోమశేఖర్, ఎస్.బంగారునాయుడు, జి.మహేష్, తదితరులు పాల్గొన్నారు.


వేపాడ: వేపాడలో భోగి మంట వద్ద స్థానికులు


శృంగవరపుకోట: శంబలనగరిలో చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న దృశ్యం


చీపురుపల్లి: చీపురుపల్లిలోని దేవాంగులవీధిలో భోగి మంట వేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, జెడ్పీటీసీ శిరీష

భోగి వైభోగం...

తెలుగు ప్రజలు మూడురోజుల పాటు జరుపుకునే సంక్రాంతి వేడుకలు సోమవారం భోగి పండగతో ప్రారంభమయ్యాయి. గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట నియోజకవర్గాల్లోని గ్రామాలు, పట్టణాల్లో తెల్లవారు జామునే చిన్నా,పెద్దా అనే తేడాలేకుండా ప్రతి ఒక్కరూ భోగి మంటల వద్దకు చేరుకుని సందడి చేశారు. ఆవుపేడతో తయారు చేసిన పిడకలను మంటల్లో వేశారు. భోగి పీడ సోకకూడదనే ఉద్దేశంతో తల్లిదండ్రులు తమ చిన్నారులకు భోగిపళ్లు పోశారు. చీపురుపల్లి పట్టణంలోని కస్పావీధిలో విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ నివాసం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి భోగి మంట వేశారు.

–సాక్షి నెట్‌వర్క్


గుర్ల: కెల్లలో వేసిన భోగి మంట వద్ద గ్రామస్తులు


చీపురుపల్లి: చీపురుపల్లిలో తన నివాసం వద్ద భోగి మంట వేస్తున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్


గంట్యాడ: పెదవేమలిలో భోగి మంట వద్ద ఓ కుటుంబ సభ్యులు


దత్తిరాజేరు: కోమటిపల్లిలో భోగి మంట వద్ద యువత, చిన్నారుల సందడి


బొండపల్లి: కొవ్వాడపేటలో భోగి మంట చుట్టూ నృత్యాలు చేస్తున్న యువత, చిన్నారులు

భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల దహనం


వేపాడ: విద్యుత్ బిల్లును భోగిమంటలో వేసి నిరసన తెలుపుతున్న ఏపీ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జగన్


గజపతినగరం: పురిటిపెంటలో భోగి మంటలో విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

గజపతినగరం/వేపాడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపడాన్ని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిరసిస్తూ సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం భోగి మంటలో విద్యుత్ బిల్లులు వేసి దహనం చేశారు. గజపతినగరం మండలంలోని పురిటిపెంటలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, వేపాడలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ మాట్లాడుతూ తాము అధికా రంలోకి వస్తే అయిదేళ్ల పాటూ విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల ప్రచారంలో, ఇంకా తగ్గిస్తామ ని చెప్పిన చంద్రబాబునాయుడు సీఎం అయిన తర్వాత ఏడు నెలలు కూడా తిరగకుండానే చార్జీలు పెంచడం దుర్మార్గమన్నారు. చంద్రబాబునాయుడు, కూటమి నాయకులు సూపర్ సిక్స్‌తో పాటు అనేక హామీలు ఇచ్చారని, ఆహామీలను అమలు చేయకుండా ఇప్పుడు కుంటిసాకులు చెబుతున్నారని మండిపడ్డారు. నిత్యావసర సరుకుల ధరలు కూడా రోజురోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. కూటమి ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పురిటిపెంటలో నిర్వహించిన కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి చింతా భాస్కరరావు, లెంక జగదీష్, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు హరికృష్ణ , నాయకురాలు వేణి, సీఐటీయూ నాయకుడు జెర్రి రాము, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో కోమటిపల్లి రైల్వే స్టేషన్ క్వార్టర్స్ నివాసితులు

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి రైల్వే స్టేషన్ క్వార్టర్స్‌లో 15 సంవత్సరాల క్రితం నివాసం ఉన్న 40 కుటుంబాల వారి ఆత్మీయ సమ్మేళనం కార్య క్రమం రైల్వే క్వార్టర్స్‌వద్ద సోమవారం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, యోగక్షేమాలు, పిల్లల చదువులు, ఉద్యోగాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆటలు, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశామని నిర్వాహకులు లవకుమార్, కుశకుమార్, సుధాకర్ ముంతాజ్, భాస్కర్, రమణ,వేణు తెలిపారు.

ఏపీజీఈఏ క్యాలెండర్ ఆవిష్కరణ


ఏపీజీఈఏ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆ సంఘం నాయకులు

చీపురుపల్లి: ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన మిగులు బకాయిలు తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్(ఏపీజీఈఏ) జిల్లా ఇన్‌చార్జి గిడిజాల లక్ష్మునాయుడు డిమాండ్ చేశారు. ఏపీజీఈఏ సంఘం 2025 క్యాలెండర్‌ను పట్టణంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని కోరారు. ఉపాధ్యాయ, ఉద్యోగులకు జీపీఎఫ్ బకాయిలు విడుదల చేయడం సంతోకరమని, మిగులు బకాయిలు కూడా తక్షణమే చెల్లించాలని కోరారు. ఆ సంఘం తాలూకా ప్రెసిడెంట్ పిన్నింటి హరి, ప్రధాన కార్యదర్శి సీహెచ్ ప్రసాదరావు, ఉపాధ్యక్షురాలు ఆల్తి వెంకటమ్మ, అసోసియేట్ అధ్యక్షుడు జరజాన అచ్యుతరావు, రాపర్తి వరప్రసాద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ టి.వి.ఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి కృషి చేస్తా..

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్


మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం: క్రీడాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక ప్రభుత్వజూనియర్ కళాశాల క్రీడామైదానంలో పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యా ర్థులు, యువత ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలకు అతిథిగా హాజరయ్యారు. కళాశాల మైదానంతో పాటు క్రీడల అభివృద్ధికి సహకారం అందించాలని పలువురు మంత్రిని కోరారు. మంత్రి స్పందిస్తూ క్రీడల అభివృద్ధి కోసం తనవంతు సహాయ సహకారాలు ఉంటాయని, మైదానంలో వివిధ ఆటలకు సంబంధించిన కోర్టుల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించనున్నామని చెప్పారు. రాత్రి పూట కూడా ఆటలు ఆడుకునేందుకు వీలుగా లైటింగ్ ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పూర్వ విద్యార్థి పి.వి.వి.గోపాలరాజును సన్మానించారు. స్థానిక నాయకులు పి.వి.వి.గోపాల రాజు, ఎం.శ్రీధర్, రావి శ్రీదర్, ప్రదీప్‌కుమార్,పూసర్ల మోహన్,తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం


శృంగవరపుకోట: కొట్టాంలో గోదాదేవి కల్యాణం జరిపిస్తున్న దంపతులు


దత్తిరాజేరు: గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు


గజపతినగరం: బజారు సెంటర్‌లోని రామాలయంలో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు


బొండపల్లి: దేవుపల్లిలో రాజరాజేశ్వరీదేవికి పూజలు చేస్తున్న భక్తులు

దత్తిరాజేరు: ధనుర్మాసోత్సవాల ముగింపు సందర్భంగా దత్తి గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త పెంకి తిరుపతినాయుడు, లక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో గోదాదేవి, శ్రీరంగనాథుడి కల్యాణ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు హరికృష్ణ మాచార్యులు ప్రత్యేక పూజలు చేయించి, అనంతరం కల్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు.

గజపతినగరంలో...

గజపతినగరం: స్థానిక బజార్ సెంటర్ రామాలయం, కోవెల వీధిలోని సీతారామాలయంలో అర్చకులు శ్రీనివాసాచార్యులు, అనిల్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో గోదాదేవి, శ్రీరంగనాథ స్వామి కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి ప్రత్యే పూజలు చేశారు. పూజల అనంతరం కల్యాణం జరిపించారు.

భాగ్యలక్ష్మిగా రాజరాజేశ్వరీదేవి

బొండపల్లి: దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు భక్తులకు సోమవారం భోగభాగ్యాలను ప్రసాదించే భాగ్యలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. భోగి పండగను పురస్కరించుకుని అమ్మవారిని అర్చకులు దూసి శ్రీధర్‌శర్మ ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కొట్టాంలో...

శృంగవరపుకోట: మండలంలోని కొట్టాం గ్రామంలో సర్పంచ్ శానాపతి బాలసన్యాసమ్మ , చంద్రరావు దంపతుల ఆధ్వర్యంలో గోదాదేవి కల్యాణం సోమవారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొని గోదాదేవి, శ్రీరంగనాథ స్వామి కల్యాణాన్ని తిలకించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు


బానాదిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ దేవి

వేపాడ: సంక్రాంతి, తీర్థమహోత్సవాల నేపథ్యంలో గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని వల్లంపూడి ఎస్‌ఐ బి. దేవి హెచ్చరించారు. బల్లంకి, బానాది, కృష్ణారాయుడుపేట గ్రామాల్లో సోమవారం ఆమె పర్యటించారు. ఆయా గ్రామాల పెద్దలు, ప్రజలతో సమావేశ మయ్యారు. సంక్రాంతి పండగతో పాటు పండగ అనంతరం నిర్వహించే తీర్థమహోత్సవాల్లో పేకాట, బల్లాటలు, కోడి పందేలు, అశ్లీల నృత్యాల ప్రదర్శ నలు ఏర్పాటు చేసినా, ప్రోత్సహించినా, అలాగే బెల్టు దుకాణాలు నడిపినా కేసులు నమోదు చేస్తామని చెప్పారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారిపేర్లు గోప్యంగా ఉంచుతామని, శాంతిభద్రతల పరిరక్షణకు అంతా సహకరిం చాలని కోరారు.

భోగి సంతలో కొనుగోళ్ల జోరు


సంతలో జనసందడి


పెద్దలకు చూపించే వస్త్రాలు కొనుగోలు చేస్తున్న గ్రామీణులు


మూడు రోడ్ల జంక్షన్‌లో చెరుకుల విక్రయాలు

చీపురుపల్లి: పట్టణంలో ఏటా భోగి రోజున సంత నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మార్కెట్‌లో అన్ని రకాల దుకాణాలు ఉన్నప్పటికీ భోగి రోజున నిర్వహించే సంతకు మాత్రం చాలా ప్రత్యేకత ఉంటుంది. సోమవారం నిర్వహించిన సంతకు నియోజకవ ర్గంలోని చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాల్లోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలంతా పండగకు కావాల్సిన వస్త్రాలు, పూజ సామగ్రి, కూరగాయలు, ఇతర సామగ్రి కొనుగోలు చేశారు. అయితే గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది సంతలో విక్రయాలకు చాలా వ్యత్యాసం ఉందనే చర్చ జరిగింది. గతేడాది సంత నిర్వహించిన రోజు మధ్యాహ్నం 12 గంటల సమయానికి చీపురుపల్లి పట్టణంలోని ప్రధాన రహదారులు కిక్కిరిసి పోయాయి. ఈఏడాది మాత్రం మధ్యాహ్నం ఒంటి గంట వరకు వాహన రాకపోకలు సజావుగా సాగాయి. భోగి సంతకు వచ్చిన వారు సైతం ఇదే విషయాన్ని చర్చించుకున్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం


విజేతగా నిలిచిన గరివిడి జట్టుకు కప్ అందజేస్తున్న డీఎస్పీ రాఘవులు

మెరకముడిదాం: క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు అన్నారు. సంక్రాం తి పండగ నేపథ్యంలో మండలంలోని సోమలింగాపురంలో లుక్‌ఫర్ ఫ్యూచర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఫైనల్ పోటీల్లో తమ్మినవలస జట్టుపై గరివిడి జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు డీఎస్పీ రాఘవులు కప్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులు, యువత ఎక్కువగా మొబైల్‌ఫోన్‌లతో కాలక్షేపం చేస్తూ సమయాన్నా వృథా చేస్తున్నారన్నారు. మొబైల్ ఫోన్‌లలో ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడుతూ, బెట్టింగ్‌లకు పాల్పడుతూ ఆర్థికంగా నష్టపోయి జీవితాలను చీకటిమయం చేసుకుంటున్నారన్నారు. అలాంటి ఆటలకు, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. చీపురుపల్లి సీఐ జి.శంకరరావు, బుధరాయవలస ఎస్‌ఐ జె.లోకేష్‌కుమార్, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు ఎస్.సీతారామరాజు, తదితరులు పాల్గొన్నారు.